క్లుప్తంగా

నేడు ఆర్‌ఓబీకు భూమి పూజ

కమలాపురం : పట్టణంలో రైల్వే ట్రాక్‌పై నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజల చిరకాల కోరిక తీర్చే ఆర్‌ఓబీ నిర్మాణానికి బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద భూమి పూజ చేయడానికి ప్రజా ప్రతినిధులు వస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు తెలిపారు.

గ్రామ వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా వున్న గ్రామ వలంటీర్ పోస్టుకు అర్హులైన వారు ఈనెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గాయపల్లెలో ఖాళీగా వున్న ఈ పోస్టు ఎస్సీ జనరల్‌కు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల 10 తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 11న పరిశీలిస్తారన్నారు. 12వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేస్తారని, 14న ఎంపికైన వారికి నియామక పత్రాన్ని అందచేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది



రక్తదానం చేస్తున్న విద్యార్థి

వేంపల్లె : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు అధ్యక్షతన రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో భోగా పార్వతమ్మ ట్రస్ట్ వారి సారథ్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తహీనత ఉన్న వారికి రక్తాన్ని దానం చేయడంవల్ల ప్రాణాన్ని కాపడిన ప్రాణదాతలమవుతామన్నారు. అనంతరం విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఓబుళరెడ్డి, భోగా పార్వతమ్మ ట్రస్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కోలాట ప్రదర్శనలో కళాకారులు

వేముల : వేముల సమీపంలోని తిరుమల నాయుని గుట్టపై వెలసిన శ్రీ మంజునాథేశ్వర స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంజునాథేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటం అందరిని ఆకట్టుకుంది. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించి శుక్రవారం జరగవలసిన ఇంటర్వ్యూలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరిదేవి తెలిపారు. జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారికి తదుపరి తేదీ ప్రకటించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అన్నారు. గురువారం మండలంలోని తలమంచిపట్నం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం జెండాను ఎగురవేశారు. సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరారుతున్న గురుకుంట ఆలయ సముదాయాలు

చుట్టూ పచ్చని పొలాలు మధ్యలో ఎత్తైన గుట్ట. గుట్టపై అనేక ఆలయాల సముదాయాలతో భక్తిభావం నిండుకున్న ప్రదేశం గురుకుంట ఆలయం. ఎదురుగా నీటితో తొణికిసలాడే కుంట వెరసి గురుకుంటగా పిలుస్తారు. ఈనెల 11వ తేదీన కార్తీక చివరి సోమవారం గురుకుంట జన సంద్రాన్నే తలపిస్తుంది. ఈ గుట్టపై పురాతన ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు ఇతర చిన్న, చిన్న ఆలయ సముదాయాలు ఉన్నాయి. ఏళ్ల తరబడి జరుగుతూ వస్తున్న తిరుణాల వేడుకలకు గురుకుంట వేదికవుతోంది.



గురిజాలలోని గురుకుంట శివాలయం

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామ సమీపంలోని గురుకుంట ఆలయం ఆలయ సముదాయాలతో అలరారుతోంది. ఈ ఏడాది ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతీసుకుని ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆలయం చుట్టూ ప్రహరీ గోడ, కమ్యూనిటీ హాలు, అలాగే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గురుకుంట మీదుగా తారు రోడ్డుతోపాటు దాతల సహకారంతో కల్యాణ మండపం నిర్మించారు.

గురుతో గురుకుంటగా రూపాంతరం :
శతాబ్దాల క్రితం ఇక్కడ ఓ గురువు ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ నివసించేవాడని చెబుతారు. అప్పట్లో కేవలం ఆంజనేయస్వామి ఆలయం మాత్రమే ఉండేదట. ఎత్తైన ప్రదేశం అక్కడే ఆలయం. ఆలయం ఎదురుగా కొనేటి లాంటి కుంట. గురువు నివసించే ఈ గుట్ట గురు గుట్టగా మారింది. ఆ తర్వాత కాలక్రమంలో కుంట కూడా ఉంది కాబట్టి గురుకుంటగా మారిందని కథనం.

అయ్యప్ప స్వాములకు నిలయం :
కార్తీక మాసంలో అయ్యప్ప దీక్ష బూనిన స్వాము లకు గురుకుంట నిలయంగా మారుతుంది. ప్రశాంత వాతావరణం, తాగునీటి సౌకర్యం, ఆలయాలు అందుబాటులో ఉండటంతో అయ్యప్ప మాలధారులు ఇక్కడ పూజలు చేసుకుంటూ దీక్ష కొనసాగించడం రాత్రి అక్కడే బస చేయడం జరుగుతూ వస్తూ ఉంది.

ప్రత్యేక బస్సు సౌకర్యం.. :
పులివెందుల ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సును నడుపుతారు. సింహాద్రిపురం–గురుకుంట, గురిజాల–వెలిదండ్ల మధ్య సాయంత్రం వరకు బస్సులు తిరుగుతుంటాయి. తిరుణాల రోజు వచ్చే వేలాది మంది భక్తులకు రోజంతా అన్నదాన కార్యక్రమం ఉంటుంది.



ఆంజనేయస్వామి మూలవిరాట్



కుంటలో కనువిందు చేస్తున్న తామర పువ్వులు



గురుకుంటలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం



గురిజాలలోని గురుకుంట దేవాలయ సముదాయం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి డాక్టర్ డుమ్మా



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మెయినుద్దీన్

లింగాల : కోమన్నూతల సచివాలయంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కళ్యాణ్ దినకర్ డుమ్మా కొట్టారు. దీంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామెయినుద్దీన్ తీవ్రంగా మండిపడ్డారు. గురువారం ఆయన లింగాల పీహెచ్‌సీని తనిఖీ చేసి పీహెచ్‌సీ సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించారు. సిబ్బంది రోగులతో మంచిగా మాట్లాడి వారిని గౌరవించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వాసుపత్రులకు రోగులను ఆకర్షింపజేయలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో ప్రభుత్వాసుపత్రులకు వస్తారని.. వారిని ఆత్మీయంగా ఆదరించి మంచి చికిత్సను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలు ప్రజలకు చేర వేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి, సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్లు కుసుమ కుమారి, ఆశాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

మునగ సాగుతో ఉపాధి పొందవచ్చు



మహిళా రైతులకు ఉచితంగా మునగ మొక్కలు అందిస్తున్న పీడీ యదుభూషణ్‌రెడ్డి

కమలాపురం : మునగ తోటలు సాగు చేయడం ద్వారా ఉపాధి లభించడంతో పాటు అధిక ఆదాయం పొంద వచ్చని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో రైతు నరసింహారెడ్డి పొలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలోని 5 వేల మొక్కలను ఆయన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ లోని ఆకులు, కాయల్లో మంచి పౌష్టికాహారం ఉంటుందన్నారు. ఇందులో పాల కన్నా 4 రెట్లు కాల్షియం ఎక్కువ ఉంటుందన్నారు. కమలా కన్నా 7 రెట్లు విటమిన్–సీ, క్యారెట్ల కన్నా 4 రెట్లు విటమిన్–ఏ ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకు గాను రైతులందరూ తమ పొలాల గట్ల పై, అలాగే ఇళ్లల్లోని పెరట్లో మునగ చెట్లు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీ వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న అష్టబంధన మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా గురువారం 6వ రోజు దేవదేవుడైన కలియుగం దైవం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటరమణుడి కల్యాణం వైభవంగా జరిగింది. తేలూరు గ్రామానికి చెందిన బీవీఎస్ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమాని, భారతి సిమెంటు కాంట్రాక్టర్ బి.వి.సుబ్బారెడ్డి వారి భూమిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భూమిరెడ్డి బ్రదర్స్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

కులగణన సర్వేకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో నిర్వహించనున్న కుల గణన సర్వేకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కులమత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన సర్వే నిర్వహిస్తారని వారికి సహకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కో– ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీసు ఆరోగ్య భద్రత స్కీం ప్రారంభం

కడప రూరల్: కడప నగరంలోని అరుణాచల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో గురువారం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ పోలీసు ఆరోగ్య భద్రత స్కీం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, మెడికల్ ఐసీయు, జనరల్ వార్డ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఇక్కడ లభిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా అందుతున్న ఉచిత వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.. ఆసుపత్రిలో లభిస్తున్న ఆధునిక వైద్య సేవలపై ప్రశంసించారు. పోలీసు శాఖ సిబ్బందికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి వారి ఆరోగ్య భద్రతకు పాటుపడాలని ఎస్పీ కోరారు. తమ ఆసుపత్రిలో లభిస్తున్న వైద్య సేవలను డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ మమతేశ్వరి ఎస్పీకి వివరించారు.

న్యాక్‌లో యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

పులివెందుల టౌన్ : పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్)లో సీడాప్, ఏపీఎస్ఎస్డీసీ సంయుక్త సహకారంతో సర్వేయర్, సోలార్ పి.వి.ఇంజనీర్, ఫీల్డ్ ఇంజనీర్ కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతోకూడిన ఉపాధి కల్పించనున్నట్లు న్యాక్ అకాడమి కన్‌స్ట్రక్షన్స్ ఆఫీసర్ రాకేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కోర్సులలో శిక్షణ పొందేందుకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది మాత్రమే ఉంటారన్నారు. కంప్యూటర్, ఆంగ్ల భాషపై అవగాహన కలిగి ఉండటం, ఏకరూప దుస్తులు, అధునాతర తరగతి గదులు, నిఘా కెమెరాలతో పర్యవేక్షణ, వారంత, పక్షాంత, మాసాంతపు పరీక్షలు, ఉచిత భోజన, వసతి సదుపాయం, యోగా, క్రీడలు, వ్యక్తిత్వ వికాస తరగతులు ఉంటాయన్నారు. శిక్షణకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, విద్యార్హత ధృవీకరణ, కుల ధృవీకరణ, రేషన్ కార్డు, 3 పాస్‌పోర్ట్ ససైజు ఫొటోలు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ తీసుకుని రావాలన్నారు. ఇతర వివారలకు 9985142155, 9000517637, 9989140993 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వేడుకగా సాయుధ దళాల పతాక దినోత్సవం



పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని ఎన్‌సీసీ కేడెట్స్ వేడుకలు నిర్వహించారు. ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ విన్నీతేజ ఆధ్వర్యంలో కేడెట్స్ పిరమిడ్ విన్యాసాలు చేసి అలరించారు. అనంతరం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రజల నుంచి, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించారు. అనంతరం సేకరించిన రూ.11,574 ను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషాకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలందించిన సైనికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ అధికారి విన్నీతేజ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : మండలంలోని చామలూరు పునరావాస కేంద్రంలో గురువారం గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డును రూ.20 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. అలాగే గండికోట నిర్వాసితులకు ఎన్నికల్లో చెప్పిన విధంగా రూ.10 లక్షలు పరిహారం 8 గ్రామాల్లో అందజేశామన్నారు. మిగితా తొలి విడత 14 గ్రామాలకు త్వరలోనే రూ .3.25 లక్షలు ఇస్తామన్నారు. పునరావాస కేంద్రంలో విద్యుత్ సమస్య ఉంటే అధికారులు పట్టించుకోలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ డీఈతో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి, ఉపమండలాధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, ఎస్.రామ సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆర్.హరినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్(అమెరికా) ప్రెసిడెంట్ రామిరెడ్డి, వారి ప్రతినిధుల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ఈ పాఠశాలలో చదవి ఉన్నత ఉన్న స్థానంలో ఉన్న ఎన్ఆర్ఐలు ఫౌండేషన్ ప్రతినిధులు సాయినాథ్‌రెడ్డి సహకారంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ పాఠశాలలో రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డి, మాజీ హోంమంత్రి డాక్టర్ ఎంవీ మైసురారెడ్డి చదువుకున్నారన్నారు. కమిషనర్ పి.జగన్నాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మానసిక వత్తిళ్లకు లోనవ్వద్దు



దివ్యాంగులకు వినికిడి యంత్రాలను అందజేస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

చక్రాయపేట : దివ్యాంగులు తమకున్న అంగవైకల్యంతో మానసిక వత్తిళ్లకు లోను కావద్దని మండల విద్యాశాఖ అధికారులు జాఫర్‌సాదిక్, రామచంద్రారెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని నాగులగుట్టపల్లెలోని భవితకేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం అండగా నిలబడుతోందని తల్లిదండ్రులు కూడా దివ్యాంగులైన తమ పిల్లలను శ్రద్ధగా చూసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఎస్ఏ సహకారంతో దివ్యాంగులకు ట్యాబ్‌లు, వినికిడి యంత్రాలతో పాటు స్టీల్ బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఐ ఈఆర్‌పీ సత్యనారాయణ, ఫిజియో థెరఫిస్ట్ విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణపై అవగాహన



విద్యార్థినికి కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సునీత

పులివెందుల రూరల్ : అంధత్వ నివారణ కోసం ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సునీత్ తెలిపారు. గురువారం పట్టణంలోని నేత్ర సేకరణ కేంద్రాన్ని ఆమె తనిఖీ నేత్ర సేకరణ ద్వారా సేకరిస్తున్న కార్నియాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలలో నేత్రదానంపై అపోహలు తొలగింపజేసి మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేత్ర సేకరణ కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ రవీంద్ర, జిల్లా అంధత్వ నివారణ సిబ్బంది సుధాకర్‌రెడ్డి, నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటల రక్షణ



ఇసుకపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



యు.రాజుపాలెంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

వల్లూరు : ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో సరైన సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చునని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు జాన్సన్, సునీల్‌కుమార్‌లు సూచించారు. మండలంలోని ఇసుకపల్లె గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. కోతకు వచ్చిన వరి పంటను, నేలకు ఒరిగిపోయిన వరి పొలంలో 5 శాతం (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపిన) ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వలన ధాన్యం మొలక రాకుండా కాపాడుకోవచ్చునని సూచించారు. వరి కుప్పలలో ఎకరాకు 20 కిలోల ఉప్పును వేయడం ద్వారా కాపాడుకోవచ్చునని తెలిపారు. పిలక దశ నుండి పాలు పోసుకునే దశలో వున్న వరి పంటలో న్యాటివో 0.4 గ్రాములు మరియు 10 గ్రాముల 13–0–45 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మినుము పంటలో హెక్సాకొనజోల్ 2 మిలీ మరియు 10 గ్రాముల 13–0–45 ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. శనగ పంటలో రబ్బరు పురుగు, శనగ పచ్చ పురుగు నివారణకు బారాజైడ్ 2.5 మిలీ మరియు 10 గ్రాముల 19–19–19 ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిసాయి జ్యోతి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేఖ, రైతులు పాల్గొన్నారు.

లింగాలలో..
లింగాల : కామసముద్రం, ఇప్పట్ల గ్రామాల్లో రబీలో సాగు చేసిన శనగ పంటను గురువారం మండల వ్యవసాయ అధికారి రమేష్ క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రబీలో సాగు చేసిన శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని.. అలాగే శనగ పంటలో పురుగు ఉధృతి, వేరుకుళ్లు తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు ఇమామేక్టిన్ బెంజోయేట్ 04.గ్రాము+న్యూవ్యాల్యూరాన్ 0.02ఎంఎల్ మరియు 19:19:19 రకం మందు 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అనంతరం కామసముద్రం గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..
చెన్నూరు : మండలంలో దెబ్బతిన్న పంటలను ఊటుకూరు ప్రధాన శాస్త్రవేత్తలు ఎం.జాన్సన్, కె.సునీల్‌కుమార్‌లు గురువారం పరిశీలించి మాట్లాడారు. దెబ్బతిన్న పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. మినుము పంటకు హెక్షజజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరాకు అలాగే నో వాల్యూ రాన్ 300 మిల్లీలీటర్లు ఎకరాకు రెండింటిని కలిపి పిచికారి చేయాలన్నారు. జొన్నలో గింజ బూజు తెగులు రాకుండా కార్తయిడిజం ఒక మిల్లీమీటర్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పై మందులు పిచికారి చేసేటప్పుడు అందులో 13–0–45 10 గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేయడం వలన మొక్కలు నిలదొక్కుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇందిర, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..
వీరపునాయునిపల్లె : మండలంలో తుపాన్ వల్ల జరిగిన పంట నష్టాన్ని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలసి యు.రాజుపాలెం గ్రామంలో పరిశీలించి మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో 268 ఎకరాల్లో వరి పంట సాగు చేశారన్నారు. రాజుపాలెం పంచాయతీలో 131 ఎకరాలు, తంగెడుపల్లెలో 58 ఎకరాలు, అనిమెలలో 64 ఎకరాలు, పిల్లివారిపల్లెలో 10 ఎకరాల్లో సాగుచేసినట్లు తెలిపారు. పంట నష్ట వివరాలను పరిశీలించి వెంటనే ప్రభుత్వానికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.